నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఆగస్టు 04, 2024 | www.navatelangana.com



## భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన వీర్ల అశోక్(34) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది ఇంటి వద్ద గల బావిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం..అశోక్‌కు బాల్కొండకు చెందిన సునీతతో ఐదేండ్ల క్రితం వివాహం జరిగింది. ఓ కుమారుడు ఉన్నాడు. ఐదు సంవత్సరాలుగా భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి అలవాటుపడి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## వనమహోత్సవంలో ఈత మొక్కలు నాటాలి

నవతెలంగాణ -ముథోల్

వన మహోత్సవంలో భాగంగా గౌడ కులస్తులు ఈత మొక్కలను నాటాలని ఎక్సైజ్ ఎస్సై గజేందర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో వనమహోత్సవంలో భాగంగా శనివారం ఎల్లమ్మ ఆలయం వద్ద ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చెరువు గట్లపై, ప్రభుత్వ ఖాళీ భూముల్లో, వాగు ఒడ్డుపై ఈత మొక్కలు నాటాలని సూచించారు. స్వచ్ఛమైన కల్లు కోసం ఈత మొక్కలు పెంపకం తప్పనిసరన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మోకుదెబ్బ గౌడ సంఘం సెక్రటరీ ఆకుల అంజిగౌడ్, ఎక్సైజ్ కానిస్టేబుల్ అక్తర్, కృష్ణమోహన్, అశోక్, గౌడ సంఘం సభ్యులు వెంకటేష్‌గౌడ్, సాయిబాబా, దేవగౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



# చిన్నపాటి తప్పులు..రైతులకు తిప్పలు..!

- ఆధార్..రుణఖాతా పేర్లలో పొరపాట్లే అధికం
- రుణమాఫీ జాబితాలో పేర్లు రాక ఆందోళన
- సహాయ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్న అన్నదాతలు

**ఇచ్చోడకు చెందిన ఓ రైతుకు 1.10లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండో విడతలో సదరు రైతుకు రుణమాఫీ రావాల్సి ఉంది. బ్యాంకు ఖాతా..ఆధార్ సంఖ్య కూడా సక్రమంగానే ఉంది. కానీ రుణమాఫీ జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో సహాయ కేంద్రాన్ని ఆశ్రయించారు. మరోపక్క ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడకు చెందిన ఓ రైతుకు సంబంధించి వివరాలన్ని సక్రమంగా ఉన్నా బ్యాంకులో ఆడిట్ చేయాల్సి ఉందనే కారణంగా మాఫీ కాలేదు. ఇలాంటి చిన్న తప్పుల కారణంగా అనేక మంది అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.**

**బ్యాంకులో తీసుకున్న పంటరుణం మాఫీ కావడంతో అనేక మంది రైతులు ఆనందం వ్యక్తం చేయగా.. ఖాతాల్లో దొర్లిన చిన్నపాటి తప్పుల కారణంగా మరికొంత మంది రైతులు తిప్పలు పడుతున్నారు. అందరికీ రుణం మాఫీ అవుతుండగా.. అర్హులమైన తమకెందుకు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాఫీకి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఎందుకు కావడం లేదనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల సాంకేతిక కారణాలతో పాటు బ్యాంకుల్లో జరిగిన పొరపాట్లు.. రుణ ఖాతా..ఆధార్‌లో నమోదైన రైతుల పేర్లలో చిన్నపాటి అక్షరదోషాలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. ఆయా కారణాలతో మాఫీకి దూరం కావడంతో ఆందోళన చెందుతున్నారు. పరిష్కారం కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ)లతో పాటు సహాయ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఎక్కడ తప్పు దొర్లిందో తెలుసుకుంటున్నారు.**



రుణమాఫీ హెల్ప్‌డెస్క్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే పంట రుణాలు అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద ఉపయోగపడుతోంది. ప్రతి ఏటా రైతులు బ్యాంకుల్లో పంట రుణం తీసుకుంటూ వాటిని చెల్లించడం.. రెనివల్ చేసుకుంటూ వస్తున్నారు. కానీ చాలా మంది రైతులు తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించే స్తోమత లేక వడ్డీలు కడుతూ రెనివల్ చేసుకుంటారు. ఇలా పెండింగ్‌లో ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీనివ్వడంతో అన్నదాతలు ఆ పార్టీని ఆదరించి గెలిపించారు. ఇందుకు 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీలోపు రుణం తీసుకున్న వారిని అర్హులుగా ప్రకటించింది. దీంతో కుటుంబానికి రూ.2లక్షలు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మొదటి విడతలో రూ.1లక్ష వరకు పంట రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం రెండో విడతలో 1.50లక్షల వరకు మాఫీ చేస్తూ రైతుల ఖాతాలకు డబ్బులు విడుదల చేసింది. ఇలా ఉమ్మడి జిల్లాలో రెండు విడతల్లో సుమారు 2.50లక్షల మంది రైతులకు సంబంధించి రుణాలు మాఫీ అయ్యాయి. కానీ ఇందులో కొన్ని చిన్నపాటి తప్పులు దొర్లడం మూలంగా అర్హులు అయినప్పటికీ కొందరు రైతులకు రుణమాఫీ జాబితాలో పేర్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**పేర్లలో చిన్నపాటితప్పులే కారణం..!**

రైతుల పేర్లలో చోటుచేసుకున్న చిన్నపాటి తప్పులు అన్నదాతలకు శాపంగా మారుతోంది.ఆధార్‌కార్డులో ఒక విధంగా.. రుణఖాతాలో మరో విధంగా ఉండటం.. బ్యాంకు ఖాతాలు సైతం తప్పుగా నమోదు చేయడంతో పాటు కొందరి వద్ద పాస్ పుస్తకాలు లేకపోవడం, రైతుల పేర్లలోనూ అక్షరదోషాలు కూడా సమస్యగా మారడం వంటి కారణాలతో మాఫీ జాబితాలో పేర్లు రావడం లేదని తెలుస్తోంది. మరోపక్క కొందరు రైతుల ఇండ్లలో ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం..పింఛనర్లు తదితర వారు సహాయ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కేవలం ఆదిలాబాద్ జిల్లాలోనే ఇప్పటి వరకు సుమారు 400మంది వరకు రైతులు వివిధ సమస్యలతో సందేహాలను నివృత్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటిని నమోదు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులు, బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క శనివారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రానికి అంతర్జాలం(ఇంటర్‌నెట్)కు అంతరాయం కలగడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు రైతులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్యను ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

## కారు బోల్తాపడి వృద్ధురాలు మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటనలో వృద్ధురాలు మృతి చెందింది. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..దిల్లీ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఓ కారు మావల మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శుభ్రంజు(70) మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తి మృతురాలి భర్త సంజీవ్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

## ఏఈఈ ఫలితాల్లో సత్తా చాటిన మండల వాసి

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని కోర్ట గ్రామానికి చెందిన గోస్కుల రవీందర్-సంగీత కుమార్తె గోస్కుల విజయ ఇటీవల వెలువడిన మిషన్ భగీరథ(ఏఈఈ) ఫలితాల్లో సత్తా చాటి ఏఈఈగా ఎంపికైంది. ఆమె సాధించిన విజయం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని పండగలా జరుపుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పండగలా జరుపుకోవాలని సార్మెడి దౌలత్‌రావ్ అన్నారు. శనివారం గాదిగూడ మండలం ఝరి రాయి సెంటర్‌లో వివిధ గ్రామ పటేళ్లతో సమావేశమయ్యారు. ముందుగా ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న రోడ్డు, విద్యా, వైద్యం సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాని ఆగస్టు 9న ప్రతి ఆదివాసీ గూడెంలో పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. 9 ఆదివాసీ తెగలు సమన్వయంతో సంఘాలు, పార్టీలకు అతీతంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్రపతి భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జంగుబాయి, ఆలయ చైర్మన్ కొడప జాకు, నాయకులు పూసం బాదిరావ్, మడావి చంద్రహరి, మెస్రం సోము పటేల్, మెస్రం శేఖర్, మెస్రం లింగు, మెస్రం రూపదేవ్, జైతు పటేల్, మెస్రం దేవ్‌రావ్, నాగోరావ్ పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన ముళ్ల పొదలు తొలగింపు



నవతెలంగాణ-లోకేశ్వరం


మండలంలోని పొట్టపెల్లి(ఎం) నుంచి హద్గాం వెళ్లే రోడ్డు కిరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను పొట్టపెల్లి గ్రామానికి చెందిన జాదవ్ శివకాంత్ శనివారం జేసీబీ ఏర్పాటు చేసి తొలగించారు. వర్షానికి పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీన్ని గమనించి యువకుడు ముందుకొచ్చి తన సొంత ఖర్చులతో పొదలను తొలగించి సమస్యను పరిష్కరించాడు. దీంతో ఇరు గ్రామాల ప్రజలు ఆయనను అభినందించారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పది మంది లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డి ఇటీవల మృతి చెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన వెంట వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఉన్నారు.

## బాధ్యతలు చేపట్టిన కాంప్లెక్స్ హెచ్‌ఎం శైలజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలంలోని మామిడిగూడ పాఠశాలలో శనివారం కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్. శైలజ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఈఆర్‌పి నగేష్, సిఆర్‌పి శంకర్, భాస్కర్, ఇస్తారి, బాల్‌కిషన్, రాంజీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేక్ సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-జైపూర్



నాయకులతో కలిసి శనివారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మండలంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాలలో పర్యటించిన ఆయన అంతర్గత రోడ్ల నిర్మాణానికి హామీ ఇచ్చారు. వేలాలలో మల్లిఖార్జునస్వామి, కుందారంలో కొమురవెల్లి మల్లన్న ఆలయాలను సందర్శించి స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. కుందారం గ్రామంలో రూ.1.16 కోట్లతో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి వైద్యుల అభ్యర్థన మేరకు ఆసుపత్రి నుండి ప్రధాన రహదారి వరకు రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అనంతరం కుందారం-కిష్టాపూర్ మధ్య గల పెద్దవాగును సందర్శించి ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతంగా ఉన్నప్పుడు వాగు మీదుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు తెలిపారు. పెద్దవాగుపై నిర్మించిన కల్వర్టు శిథిలమైందని, కల్వర్టు స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలని కోరారు. సర్వే నెం.50లో సుమారు 400 ఎకరాల భూమిని ప్రభుత్వం పంపిణీ చేసినప్పటికీ రికార్డుల్లో లబ్ధిదారుల వివరాలు పొందుపర్చలేదని కిష్టాపూర్ రైతులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఈ కారణంగా సుమారుగా 200 మంది రైతులు ప్రభుత్వ పరంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఫయాజోద్దీన్, నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు లింగారెడ్డి, సమ్మయ్య, పద్మజపాపిరెడ్డి, శ్యామల లక్ష్మణ్, సారయ్య, ఆవిడపు గణేష్, నాయకులు ముదాం రమేష్, జక్కుల వెంకటేశం, బేతు తిరుపతిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జైనొద్దీన్, మంతెన లక్ష్మణ్ ఉన్నారు.



## గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

రేచిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గంజాయి, మాదకద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలు, యాంటీ ర్యాగింగ్‌పై ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామి మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఉండాలని సూచించారు. ఎవరైన గంజాయి అమ్మినా, పీల్చినా, సాగు చేసినా సమాచారం అందించాలన్నారు. గంజాయి మహమ్మారి నిర్మూలనలో ప్రజలంతా తమ వంతుగా కృషి చేయాలని కోరారు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్తచట్టాల గురించి అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో గమ్యంపై అవగాహన

నవతెలంగాణ-నిర్మల్



ఆర్టీసీ నిర్మల్ డిపోలో శనివారం గమ్యంపై రీజినల్ మేనేజర్ సోలోమాన్ అవగాహన కల్పించారు. రోజురోజుకూ ఆర్టీసీలో వివిధ శాఖలలో టెక్నాలజీ ద్వారా ఎన్నో రకాల మార్పులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఎక్కాల్సిన బస్సు ఎప్పుడు వస్తుంది, దూర ప్రాంతాల నుండి మన బంధువులు ఆర్టీసీ బస్సులో వస్తే ఎక్కడి వరకు వచ్చారు అనేది సులభంగా చూసుకోవడానికి ప్రతి ఒక్క వ్యక్తి మొబైల్‌లో ప్లే స్టోర్ ద్వారా గమ్యం ఆప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్, నవీన్‌కుమార్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ రాష్ట్రంలో కులగణన జరిపిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ అన్నారు. బీసీ ఐక్యవేదిక నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం అధికారంలోకి వస్తే కుల జనగణన చేస్తామని, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కుల గణన హామీ ఇప్పటి వరకు అమలు జరపలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రయత్నాలు మొదలయ్యాయని, ఇది ప్రజల కిచ్చిన హామీని భంగ పరచడమేనని విమర్శించారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేసి బీసీ జనగణన సత్వరం చేపట్టాలని డిమాండ్ చేశారు. కుల గణన చేసి బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, శ్రీరామోజు కొండయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, అర్కాల ఓదెలు, పద్మశాలి సంఘం నాయకులు నాగరాజు, వేముల మల్లేశం, అడిచర్ల రాజయ్య, గుంటుక సోమన్న, అఖిల్ రాజేందర్ పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-వేమనపల్లి

ఆగస్టు 5 నుంచి నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అభివద్ధి అధికారి దేవేందర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులకు, ఈజీఎస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 5 నుండి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై మార్గదర్శకాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు వారి కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా కార్యక్రమాలను విజయవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏట వీరన్న, డిప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి పాల్గొన్నారు.

## ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్



**ఆదిలాబాద్‌టౌన్ :** ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించిన సుజాత లాంగ్ లీవ్ పెట్టడంతో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న రొడ్డ శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించారు. మళ్లీ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా జన్నారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌ను కళాశాలకు బదిలీ చేస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రొడ్డ శ్రీనివాస్‌ను ఉట్నూర్ ఐటీఐ కళాశాలకు ట్రైనింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను కళాశాల బృందం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఆగస్టు 04, 2024 | www.navatelangana.com



## గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

నవతెలంగాణ-బేల

గంజాయి సాగు చేస్తూ, తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై డి.రాధిక తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తల్లైగూడకి చెందిన కుమ్ర పరశురామ్, జైనథ్ గ్రామానికి చెందిన దైగిరి సాయికృష్ణల వద్ద 1.184 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పరశురాం తన పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నట్టు విచారణలో తేలడంతో 18 గంజాయి మొక్కలను సీజ్ చేశాం. గంజాయి తరలించడానికి ఉపయోగించిన కేటీఎం మోటార్ సైకిల్‌ను, రెండు మొబైల్ ఫోన్ లను కూడా స్వాదీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరి పైన ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్టు తెలిపారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.29వేలు ఉంటుంది.

## తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిది

నవతెలంగాణ-లోకేశ్వరం

తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటిదని, అంగన్‌వాడీ ఫర్హాన, అన్నారు. శనివారం మండలంలోని బామ్ని(కె) గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన, తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు, మహిళలకు ముర్రుపాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం రాణి, పంచాయతీ కార్యదర్శి విఠల్, ఎంఎల్‌హెచ్‌పీ వంశీ, ఆశా కార్యకర్త పోసాని, ఐకేపీ అధ్యక్షురాలు శారద, ముక్రమున్నిస పాల్గొన్నారు.



## మార్కెట్ కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-బోథ్

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నారా మనోహర్ సాధారణ బదిలీపై వెళ్లడంతో శనివారం మార్కెట్ యార్డులో ఆయనను మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం పెంచడంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టారని, మార్కెట్ కమిటీ నికర ఆదాయాన్ని పెంచడంతో పాటు మార్కెట్ ఆస్తులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుల చంటి, భోజన్న, నాగేందర్, గడ్డల నారాయణ, సాయన్న, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులను పరిశీలించిన డీఈఈ



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో పరిధిలో కొనసాగుతున్న భైంసా, బాసర, 161 బీబీ జాతీయ రహదారి పనులను జాతీయ రహదారుల శాఖ డీఈఈ సుభాష్ శనివారం తనిఖీ చేశారు. బాసర గోదావరి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. అలాగే బాసర మండలంలోని బిదిరెల్లి, ముధోల్ మండలంలోని తరోడ, భైంసా మండలంలోని దేగాం, గ్రామాల వద్ద రోడ్డు విస్తరణ పనులను తొందరగా చేపట్టాలని, అనుష కన్స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధి విష్ణువర్ధన్ రెడ్డికి సూచించారు. తొందరగా ఆక్రమణలను తొలగించి, రోడ్డు వెడల్పు, మురికి కాలువ నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే స్థానికులు, సంబంధిత అధికారుల సహాయంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. వానదారులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. రోడ్డు నిర్మాణం పనులు నాణ్యతతో పాటు గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.

## యువజన కాంగ్రెస్ అధ్యక్ష బరిలో సూర్యవంశీ విలాస్



నవతెలంగాణ-కుభీర్

ఎన్ఎస్‌యూఐ విద్యార్థి దశ నుంచి యూత్ కాంగ్రెస్‌లో పలు పదవులు అనుభవిస్తూ, పార్టీ కోసం ముందుండి పోరాడుతున్న కష్టపడుతున్న వాళ్లకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు సూర్యవంశీ విలాస్ అన్నారు. శనివారం మండలంలోని పల్సి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ అధ్యక్ష అభ్యర్థి విలాస్ మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ విద్యార్థి, నిరుద్యోగ సమస్యల పట్ల పూర్తి చిత్తశుద్ధితో అనేక ఆందోళన కార్యక్రమాలు చేశామన్నారు. తమ విలువైన ఓటు వేసి గెలిపించాలని యువతీ, యువకులను అభ్యర్థిస్తున్నట్టు తెలిపారు. జులై 22 నామినేషన్ వేసినట్టు తెలిపారు. దీంతో ఆగస్టు 5వ తేది నుంచి సెప్టెంబర్ 5వరకు ఎన్నికలు ఉంటాయని, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు విలాస్ తెలిపారు. నియోజకవర్గ యువజన సభ్యులు అందరూ కలిసి నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, సతీష్, ఎందుర్ ప్రసాద్, షేక్ ఇమ్రాన్, జాదే దత్తాత్రి పాల్గొన్నారు.

## మూడో రోజు 469 మంది వెరిఫికేషన్ పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో డీఈఈ సెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ర్యాంకుల ఆధారంగా అభ్యర్థులు వెరిఫికేషన్‌కు రాగ సిబ్బంది ధృవపత్రాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. శనివారం మూడో రోజు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఆదిలాబాద్ డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు. 550 మంది అభ్యర్థులకు గాను 469 మంది అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారని, 81 మంది హాజరుకాలేదని వివరించారు. నేడు ఆదివారం కావడంతో వెరిఫికేషన్ ఉండదని సోమవారం వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

# లక్షలాది ప్రజల గొంతుక సున్నం రాజయ్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివంగత మాజీ సున్నం రాజయ్య లక్షలాది ప్రజల గొంతుకని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మాజీ ఎమ్మెల్యే, టీఏజీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆదర్శ ప్రజానేత సున్నం రాజయ్య నాలుగో వర్ధంతి కార్యక్రమం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ భద్రాచలం ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచి ప్రజా గొంతుకగా కార్మిక గిరిజన, ప్రజా సమస్యలపై గళం వినిపించారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రజా సమస్య ఉన్న అక్కడ రాజయ్య వెళ్లి సంఘీభావం తెలిపి, అసెంబ్లీలో వారి సమస్యలు మాట్లాడే వారని కొనియాడారు. కడ వరకు కమ్యూనిస్టు విలువలతో బ్రతికి ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శ నాయకుడిగా నిలిచారన్నారు. ఉమ్మడి జిల్లా ఆదివాసీల సమస్యలపై ఎప్పటికప్పుడు అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రత్యక్ష పోరాటాలకు హాజరయ్యేవారని తెలిపారు. గిరిజనుల సమస్యలపై అనునిత్యం పోరాడేందుకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) స్థాపించి, దాని ద్వారా గిరిజన ప్రజల్లో చైతన్యం చేస్తూ పోరాటాలను నిర్మించి ప్రజలను కదిలించారన్నారు. ఆయన నడిచిన బాటలో నేటి తరం యువత నడిచి ప్రజా పోరాటాలను నిర్మించడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి, కార్యదర్శి లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, నాయకులు సుజాత, పోచక్క, ఆశన్న పాల్గొన్నారు.

# రైతులు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బోథ్

రైతులు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ బషెట్టి అన్నారు. శనివారం మండలంలోని సొనాల గ్రామీణ బ్యాంకులోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుత రుణమాఫీ నైపథ్యంలో సైబర్ క్రైమ్ నేరగాళ్ల రైతులకు వివిధ రకాలైన లింకులు, మెసేజ్‌ల ద్వారా వివిధ బ్యాంకుల ద్వారా మెసేజ్‌లు పంపి తమ ఖాతాలోని డబ్బులను కాజేస్తున్నారు. రైతులు వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకుల నుంచి ఏలాంటి మెసేజ్లు వచ్చిన బ్యాంక్ అధికారులను సంప్రదించాలని సూచించారు. బ్యాంక్ సుబ్బంది సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ మెసేజ్‌లును, లింకులను ఓపెన్ చేయొద్దని తెలిపారు. అలాగే తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నరేందర్, సిబ్బంది శర్మ మాట్లాడుతూ రైతులు ఆధార్, పాన్‌కార్డ్ సంబంధించిన వివరాలను ఎవరికి చెప్పొద్దని, ఆన్‌లైన్ ఆర్డర్ చేసినట్టు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటారని, అలా చేస్తే మీ అకౌంట్‌లో డబ్బులు ఖాళీ అవుతాయని తెలిపారు. ఆర్థిక నేరాలు జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



**ఇచ్చోడ :** సైబర్ నేరాలపై రైతులు జాగ్రత్తలు పాటించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సునీల్ మనోహర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ డబ్బులను వివిధ బ్యాంకులలో జమ చేసింది. తెలుసుకొని దానిని సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుని బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని తెలుపుతూ మోసపూరిత మాటలు మాట్లాడుతూ రైతుల మొబైల్ ఫోన్లకు లింకు, ఓటీపీలు పంపుతూ వివరాలు తీసుకొని అకౌంట్‌లో నుంచి డబ్బులను కాజేస్తున్నారని మేనేజర్ తెలిపారు. బ్యాంకుల నుంచి ఎవరు ఫోన్ కాల్ చేయరని వివరించారు. ఏదైనా సందేహం ఉంటే బ్యాంకుకు వచ్చి సంప్రదించాలన్నారు. ప్రజల కోసమే బ్యాంకులు పనిచేస్తున్నాయని, బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ సంతోష్, పెందూర్ దంజీ, అరవింద్ గౌడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చదనం-పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-కుభీర్

పచ్చదనం పరిశుభ్రతపై మండలాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ప్రారంభించేలా కృషి చేయాలన్నారు. గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం, ఇంటి స్థలాల్లో, కమ్యూనిటీ స్థలాల్లో మొక్కలు అధికంగా నాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీంతో పాటు గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని గ్రామస్తులకు అవగహన కల్పించాలని అన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలపై నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం 5రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణంలో చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 5రోజులు రోజు ఒక్క కార్యక్రమం తీసుకొని ప్రజలకు పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీఓ మోహన్ సింగ్, ఏపీఓ హరిలాల్, మండల అధికారులు ఉన్నారు.

# పూలాజీ బాబా 27వ వార్షికోత్సవం

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో పూలాజీ బాబా ధ్యాన కేంద్రంలో 27వ వార్షికోత్స కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి హజరై మాట్లాడారు. ధ్యానం, యోగ ఏకగ్రతను పెంచుతాయన్నారు. వీటివల్ల మనిషి జీవన విధానం మారి ఆరోగ్యంతో పాటు న్యాయం, ధర్మం, ఆలోచించే శక్తి పెరిగి క్రమశిక్షణతో మనిషి జీవనం కొనసాగిస్తారన్నారు. ప్రతి ఒక్కరం ధాన్యం యోగ అలవర్చు కోవాలని అన్నారు. హయంలో పూలాజీ బాబా ధ్యాన మందిరానికి నీటి వసతి కల్పించేందుకు బోరు మంజూరు చేసి మోటార్ బిగించడం జరిగిందన్నారు. మైక్ సెట్ అందించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలో మరింత అభివృద్ధి పరిచేందుకు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న పూలాజీ బాబా కుమారుడు కేశవ్, సోనీ సింగ్, పోశెట్టి, సునీత, సురేష్ రెడ్డి, అశోక్, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.



**కాంగ్రెస్‌లో పలువురు చేరిక...**

మండలంలోని భరంపూర్ గ్రామానికి చెందిన పలువురు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు గణేష్‌గౌడ్ కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్‌రావు, గోక భూమారెడ్డి, ప్రతాప్, పాట్నా నర్సయ్య, నమ్ము, పొశెట్టి ఉన్నారు.

## ధరణి దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలను తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాల వారీగా ధరణి దరఖాస్తులు, ఇప్పటివరకు పూర్తి అయినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్లతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా వచ్చిన ధరణి, దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్టు కేసులు ఇతర అంశాలను ప్రధాన



కార్యదర్శికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. తహసీల్దార్లు, ఆర్డీఓలు ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తర్వాతి దశకు పంపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని సఖీ కేంద్రం పారామెడికల్ అధికారి సుకేష్ణ అన్నారు. శనివారం మండలంలోని వాన్వట్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు, కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళల, బాలికల చట్టాలు గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాల గురించి, సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అత్యావసర సమయాలలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930 జరుగుతున్న హింసలు, లింగ సమానత్వం, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సమీనా, ఏఎస్ఎం ఇందుబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

నవతెలంగాణ-నార్నూర్

చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, ఏంఎల్‌హెచ్‌పీ హిమబిందు తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండలంలోని ఖంపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని గోండుగూడా, ఖాతిగూడలో చిన్నారులకు టీకాలు వేశారు. ఏడు మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, ఉచిత మందలు పంపిణీ చేశారు. అదేవిధంగా గాదిగూడ మండలంలోని పర్సవాడ గ్రామపంచాయితీ పరిధిలోని ధర్మగూడలో అంగన్‌వాడి కేంద్రంలో హెచ్‌ఈఓ రాథోడ్ రవీందర్ తల్లిపాల వారోత్సవాల భాగంగా ఆరు, ఏడు, నెలల చిన్నారులకు అన్న ప్రసన కార్యక్రమం చేయించారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలే తాగించాలని, తల్లిపాలే అబ్బుతమని అన్నారు. గర్భిణులు రక్త హీనత లేకుండా పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. ఈ వైద్యశిబిరంలో సిబ్బంది మాన్కుబాయి, సులోచన, ఈశ్వరి, విద్యారాణి, ఆశా రంభబాయి, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

## దస్నాపూర్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పిట్టబొంగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని దస్నాపూర్‌లో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 48 ఓపీలను పరీక్షించినట్టు డాక్టర్ ప్రతాప్ నాయక్ తెలిపారు. అవసరమైన వారికి రక్తపు పరీక్షలను చేసి, రోగులకు మందులను అందజేశారు. అనంతరం గ్రామంలో డ్రై డేను నిర్వహించారు. ప్రతి ఇంటిటికి వెళ్లి టైర్లు, వివిధ కులాయిలో నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, నీళ్ల నిల్వ ఉండటంతో దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ, వంటి జ్వరాలు సోకుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వైద్యశిబిరంలో సిబ్బంది గంగమ్మ, గోకుల్, మాధవి, సునీత పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కుభీర్

ఉద్యోగ క్యాలెండర్‌ను సీఎం విడుదల చేయడంతో శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవకుశ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండేందుకు ఎంతో కృషి చేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ కార్యాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బషీర్, జాదవ్ శంకర్, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కళాశాల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ శృతి ఓజా, జేడీ లక్ష్మారెడ్డి, ఆర్జేడి జయప్రదలను కలిసి వినతిపత్రం అందజేశారు. కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన బోధన, బోధనేతర సిబ్బంది, మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. అలాగే తానూరు జూనియర్ కళాశాల కోసం నూతన భవనం, మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. కుబీర్ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఓ సబార్డినేట్ వేతనం విషయంపై కూడా అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దొనికెన్ వెంకటేష్, గెస్ట్ లెక్చరర్స్, సీడీసీ సభ్యులు ఉన్నారు.

## రోడ్డు నిర్మాణం కోసం పరిశీలన

నవతెలంగాణ-తిర్యాణీ



మండలంలోని గుండాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డేవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ కోట్నక తిరుపతి శనివారం పర్యటించారు. దండేపల్లి మండలం ఊట్ల గుట్ట నుండి తిర్యాణి మండలంలోని గుండాల వరకు రోడ్డు నిర్మాణం కోసం నడుచుకుంటూ రోడ్డును పరిశీలించారు. ఆయనతో పాటు హైదరాబాద్ ఎస్‌సీ శంకర్, మంచిర్యాల జిల్లా డీఈ బాపూరావు, జేఈ, ఏఈ, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఇది బడి..బర్లకొట్టం కాదు

నవతెలంగాణ-కౌటాల



కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వర్షం నీరు నిలిచి నీటి కుంటలా దర్శనం ఇస్తుంది. మండలంలోని గురుడుపేట్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నీరు నిలిచి చెరువుల తలపిస్తుంది. శనివారం ఎంపీడీఓ కోట ప్రసాద్, నోడల్ అధికారి గావుడె హనుమంతు పరిశీలించి ప్రహరీ గోడ వెనుక నుంచి దారి తీసి నీటిని విడుదల చేశారు. నీరు వెళ్లే విధంగా తవ్వించి వర్షం నీరు బయటికి పంపించడం జరుగింది. తగు పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇది బడి బర్లకొట్టం కాదని, పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పి.రాజేష్, కార్యదర్శి సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అడ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని రైతులకు ప్రాణాధారమైన కొమరం ప్రాజెక్టుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురం భీం ప్రాజెక్టుకి మరమ్మత్తులు చేయించి, రైతులకు సాగు నీరందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులను నియమించి, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. పేద, కార్మిక, దళితల, గిరిజనుల పక్షాన ఉండి కమ్యూనిస్ట్ పార్టీ పోరాడుతూ వారికి అండగా ఉంటుందన్నారు. పేద ప్రజలకు భూ పంపిణీ చేసిన చరిత్ర సీపీఐ(ఎం) పార్టీకి ఉందన్నారు. అంతే కాకుండా ఉపాధి హామీ చట్టం రూప కల్పనలో పార్టీ కృషి ఉందన్నారు. జిల్లాలో పోడు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులు అధికమయ్యే అవకాశం ఉందని, గ్రామాల్లో మెడికల్ క్యాంపులను నిర్వహించాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రెగ్యులర్ వైదులతో పాటు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ తరగతులలో పార్టీ జిల్లా కార్యదర్శి కూషన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గొడిసెల కార్తీక్, రాజేందర్, రాజ్ కుమార్, బక్కన్న, మాలశ్రీ, కమల వివిధ మండలాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్ఐ ధీకొండ రమేష్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్, సిర్పూర్ ప్రధాన రోడ్డు మార్గం మధ్యలో ఉన్న భీమన్న గుడి సమీపంలో రైల్వే గేట్‌కు వెళ్ళే మార్గంలో భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు పూర్తిగా గుంతలుగా మారింది. బురదతో ప్రయాణికులు పదిహేను రోజులుగా అనే ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందులను గమనించిన ఎస్ఐ ధీకొండ రమేష్ శనివారం రోడ్డు మరమ్మత్తులు చేయించారు. ట్రాక్టర్లతో గుంతల మట్టి పోయించారు. కొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలతో రైల్వేగేట్ సమీపంలో ఉన్న రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఉండడం మూలాన ఆ గొంతులో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికుల ఇబ్బందులను గ్రహించి మరమ్మత్తులు చేయించిన ఎస్ఐని ప్రయాణికులు అభినందనలు చెప్తున్నారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సుగుణక్క



నవతెలంగాణ-రెబ్బెన

మండలం సింగిల్ గూడలో లావుడ్య శాంతాబాయి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క, కుమురం భీం, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు శనివారం నివాసానికి వెళ్లి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి శాంతాబాయి చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇందులో మండల అధ్యక్షులు రమేష్, విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన ఎంఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన డి.సోమయ్య శనివారం మాజీ మంత్రి జోగు రామన్నను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జోగురామన్న ఆయనను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కౌటాల నుండి ఆదిలాబాద్‌కు బదిలీ రావడం పట్ల సంతోశం వ్యక్తం చేసినట్లు రామన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కే నర్సయ్య, సత్యనారాయణ ఉన్నారు.

# ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లపై చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎల్ఆర్ఎస్ 2020లో లేఅవుట్ ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పథకం ద్వారా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనం నుండి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పి. శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ నుండి రాష్ట్ర మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, భూ పరిపాలన కమిషనర్ నవీన్ మిథల్ ఇతర కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లేఅవుట్ ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. వీసీలో కలెక్టర్ పాల్గొని లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం 2020 ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్, పంచాయితీ రాజ్ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ఇరిగేషన్ భూములలో ఏర్పాటు చేసిన లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూముల రక్షణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**జిల్లాలో 593 పెండింగ్ దరఖాస్తులు**

జిల్లా పరిధిలో భూ సమస్యల కోసం ధరణి పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. జిల్లాలో తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్ లాగిన్‌లలో మొత్తం 593 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, ఈ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి 10 రోజులలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీసీలో కలెక్టర్ పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల వివాదాలకు సంబంధించి దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితో పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. సీసీఎల్ఏ నుంచి నుండి తిరిగి వచ్చిన దరఖాస్తులను పునః పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేష్ అధికారులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలపై అవగాహన




నవతెలంగాణ-పెంచికల్‌పేట్

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని సంజీవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పుట్టిన పాపకు శ్రేష్టమని, బిడ్డ పుట్టిన 24 గంటల్లో ముర్రుపాలు తాగించాలన్నారు. దానిద్వారా వారికి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, పాప ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, పిల్లలు తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సావిత్రీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**బెజ్జూర్ :** మండలంలోని సులువుపెల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అన్నప్రసరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతనంగా అంగన్‌వాడీ సెంటర్లలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు తల్లిదండ్రులతో అంగన్‌వాడీ టీచర్లు అన్న ప్రసన్న కార్యక్రమాన్ని చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దుర్గా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**వాంకిడి :** మండలంలోని కోమటిగూడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించామని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ఒక గంటలోపు ముర్రుపాలు తాగిస్తే రోగనిరోధక శక్తి నిమోనియా, నీళ్ల విరేచనాలు, మధుమేహం రాకుండా కాపాడుతాయని, పిల్లల్లో జ్ఞాపకశక్తి అధికంగా ఉంటుందని, తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా గర్భాశయం, రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో రేణుక, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు అంకుబాయి, యమున, చంద్రకళ, నందిని, కౌసల్య పాల్గొన్నారు.

**కౌటాల :** అంగన్‌వాడీ కేంద్రంలో అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గురుడుపేట్ గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో అన్న ప్రాసన కార్యక్రమం చేపట్టగా ఎంపీడీఓ కోట ప్రసాద్, ప్రత్యేక అధికారి పాలకుర్తి రాజేష్ పాల్గొన్నారు.



వాంకిడి



బెజ్జూర్

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-తిర్యాణి



తిర్యాణి : మాట్లాడుతున్న తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి భగవంత్

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి తొమ్మిది తెగల సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీ పోరాటాలు, కావాల్సిన హక్కుల గురించి రాష్ట్రపతి భవనంలో మన ఆదివాసీ గలం విప్పాలని, ముందుండి హక్కులను సాధించుకోవాలని ఈ సందర్భంగా ఆదివాసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాష్, మండల అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

**సిర్పూర్(టి) :** ఈనెల తొమ్మిదో తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ మన్నెవార్ జిల్లా అధ్యక్షుడు గంట గోపాల్ అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన తెగల మండల నాయకుల సమావేశంలో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని అన్ని గూడల్లో భీమ్ విగ్రహలకు పూజలు చేసి జెండా ఆవిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో పాల్గొని సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సూర్పం అర్జు, తుడుం దెబ్బ అధ్యక్షుడు గెడం నగేష్, సార్మెడీ అధ్యక్షుడు సూర్పం భగవంత్ రావు, గడ్డం రంగన్న, టీకం హనుమంత్, చింతపూరి భీమరావు, కర్నె దేవాజీ, ఆత్రం శంకర్, పూజారి పవన్ మడవి వెంకటేష్, దుర్వ దర్మ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకుడు అరిగెల మల్లికార్జున్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇదే సందర్భంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున నిలబడే అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. కలిసికట్టుగా పనిచేస్తే విజయం సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, నాయకులు ప్రహ్లాద్, పెంటయ్య, జయరాజు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-బోథ్

సాధారణ బదిలీలో వెళ్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నారా మనోహర్‌ను శనివారం మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం పెంచడంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుల చంటి, భోజన్న, నాగేందర్, గడ్డల నారాయణ, సాయన్న, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## టీజీబీలో దొంగతనానికి యత్నం

- సోషల్ మీడియాలో సీసీటీవీ పుటేజీ
- దొరికిన దొంగ



నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని టీజీబీలో శుక్రవారం రాత్రి దొంగతనానికి యత్నం జరిగింది. దీనికి సంబంధించి సీసీటీవీ పుటేజీ సోషల్ మీడియాల అయ్యాయి. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం టీజీబీ స్టాఫ్ ప్రతిరోజులాగే సాయంత్రం 7.45కు బ్యాంక్‌ను మూసి చేసి వెళ్లిపోయారు. బ్యాంక్ మేనేజర్ నవీన్‌కు బ్యాంకులో దొంగలు పడ్డారని అర్ధరాత్రి 1.30 గంటలకు బ్యాంక్ బిల్డింగ్ ఓనర్ దగ్గర నుండి ఫోన్ రావడంతో బ్యాంక్ సిబ్బందితో కలిసి బ్యాంకుకు చేరుకునే సరికి బ్యాంకు తలుపులు బద్దాలుగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారమందించారు. అప్పటికే దొంగ బయటకెళ్ళిపోయాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీటీవీలో రికార్డ్ అయిన దృశ్యాలను పరిశీలించారు. ఆ దృశ్యాలను సోషల్ మీడియా ద్వారా స్ప్రెడ్ చెయ్యడంతో తెలిసిన వారు గుర్తుపట్టి పోలీసులకు సమాచారమివ్వడంతో చిన్న ఐనంలో పోలీసులు దొంగను పట్టుకున్నారు. అదే గ్రామానికి చెందిన అల్లకొండ రమేష్‌గా గుర్తించారు. మేనేజర్ నవీన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దొంగను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ కరుణాకర్ పరిశీలించారు.

## బదిలీపై వెళ్తున్న ఎంపీఓకు సన్మానం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న గంగాసింగ్ బదిలీపై బాసర మండలానికి వెళ్తున్న సందర్భంగా మండలంలోని మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో ఆయనను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగాసింగ్ మండలానికి చేసిన సేవలు మరిచిపోలేనివని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని, ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు శ్రీనివాస్, సంజీవ్, రాజన్న, చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ దూగుంట రాజన్న, ఎంపీడీఓ అల్బర్ట్, నాయకులు రాజన్న, బండన్న, చంద్రకాంత్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రెబ్బెన





తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) బెల్లంపల్లి ఏరియా కమిటీని టీబీజీకేఎస్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి ఆమోదంతో గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్‌రాజ్ శ్రీనివాసరావు ప్రకటించారు. శనివారం 30 మందితోని ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా కార్యదర్శులుగా మారిన వెంకటేష్, అలవేణి సంపత్ ఉన్నారు. నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందనించారు. బెల్లంపల్లి ఏరియాలోని కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్ ఓరం కిరణ్, మాంత్ సమ్మయ్య, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, ట్రెజరర్ వంగ మహేందర్ ఉన్నారు.

## గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు డాక్టర్ రెడ్డి ల్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, కరీంనగర్‌లలోని డాక్టర్ రెడ్డి ల్యాబ్ శిక్షణ కేంద్రంలో 3 నెలల పాటు వివిధ కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందని, ఎలక్ట్రికల్, మెకానికల్‌లలో ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన 18-28 సంవత్సరాల వయసు గల వారికి సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్స్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ కోర్సులలో 3 నెలలు, కంప్యూటర్ సైన్స్‌లో బీసీఏ, బీఎస్సీ అర్హత కలిగిన వారికి ఫుల్ స్టాక్ డెవలపర్ కోర్సులో 3 నెలల ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల గిరిజన నిరుద్యోగ యువతీయువకులు తమ ధృవపత్రాలతో ఈ నెల 5వ తేదీ నుండి 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఉట్నూర్‌లోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్ నంబర్ 9010295910, 9666748105, 9493535052లలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వాలీంటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించేందుకు యువత, అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి తమ పేర్లను వాలీంటర్లుగా నమోదు చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అధిక సంఖ్యలో యువత స్వచ్ఛందంగా తమ సేవలను అందించేలా ముందుకు రావాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ విధానంలో లింక్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వచ్చిన గూగుల్ ఫామ్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్‌లో అయితే వారివారి గ్రామ పంచాయితీ, మున్సిపల్ కార్యాలయాల్లో వాలంటీర్లుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పేర్లు నమోదు చేసుకునే వారు స్థానికంగా నివాసితులై ఉండాలని, ఉత్తమంగా సేవలందించిన వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించడం జరుగుతుందని, మూడు నెలల తర్వాత సంతృప్తికరంగా ఉన్న వారి సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం

నవతెలంగాణ-మందమర్రి



అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఘనంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రెండవ జోన్ విద్యానగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో కమ్యూనిటీ బేస్డ్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 2వ జోన్ లోని 1,2 కేంద్రాలలోని పిల్లలకి అన్నప్రాసన అక్షరాభ్యాసం చేశారు. తొమ్మిది నెలలు పూర్తి చేసుకున్న పిల్లలకి అన్నప్రాసన, రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు ఎం ఆదిలక్ష్మి, వి శ్రీలత, ఆశాలు సుజాత, స్వరూప, ఆయా సరోజ పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-జన్నారం



మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజవర్ధన్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రజలకు, వాహనదారులకు, యువకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోవడం, మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేక వాహనాలు నడపడం, తదితర వాటి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

## అక్రమ షెడ్ల తొలగింపు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల మున్సిపాలిటీలో అనుమతులకు విరుద్ధంగా వెలసిన పలు షెడ్డులను మంచిర్యాల మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ ఆవరణలో ఉన్న టేలలను జేసీబీ, మున్సిపల్ సిబ్బంది సహాయంతో తొలగించారు. రోడ్డు పై ఇష్టానుసారంగా ఉండడంతో గత మూడు నెలల క్రితమే ఖాళీ చేయాలనీ సమాచారం ఇచ్చామన్నారు. షెడ్లతో రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని షెడ్డులను ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టణంలో అనుమతులకు విరుద్ధంగా ఉన్న ఇంకా కొన్ని టేలలను తొలగిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. అధికారులకు, చిరువ్యాపారులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

## మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు అరికట్టాలు




నవతెలంగాణ-నస్పూర్

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం జ్యోతి అన్నారు. శనివారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్య భారతావనిలో మహిళలు రెండవ శ్రేణి పౌరులుగా చూడబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ నేటికీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమని ఆమె అన్నారు. బేటి బచావో బేటి పడావో నరేంద్ర మోడీ నినాదం నీళ్ల మూటగా మారిందని ఆమె తెలిపారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు జరుగుతున్న, మోడీ సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. సాక్షాత్తు బీజేపీ పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషన్ సింగ్ మహిళా మల్లయోధులను వేధించాడని దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేసిన నరేంద్ర మోడీ స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో సగం ఉన్న మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ప్రగతిశీల మహిళా సంఘం మంచిర్యాల్ డివిజన్ 7వ మహాసభ సందర్భంగా 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షురాలుగా మంగ, ఉపాధ్యక్షురాలుగా మహేశ్వరీ, లలిత, ప్రధాన కార్యదర్శిగా అనిత, సహాయ కార్యదర్శిగా మీనా, శ్యామల, కోశాధికారిగా రాజ కళ, కమిటీ సభ్యులుగా భాగ్య, పద్మ, ఓదెమ్మ సునీత, నర్సక్క, సరోజ, లక్ష్మి, పద్మ, కోమల, ఉమాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఉత్పత్తి ఉత్పాదకతపై సమీక్ష




నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత, ఉద్యోగుల సంక్షేమంపై శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఉన్న భూగర్భ, ఉపరితల గనులలో తీసుకుంటున్న రక్షణ చర్యలపైన, ఉద్యోగుల సంక్షేమం సంబంధించిన ప్రతి అంశాన్ని ఎల్లవేళలా పర్యవేక్షిస్తుండాలని అన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగులకు అందించవలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉండాలని, అలాగే 2024-25 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి తీసుకోవాల్సిన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఓ టూ జీఎం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు ఏవీరెడ్డి, రాముడు, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్, సర్వే అధికారి వేంకటేశం, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని నీల్వాయి గ్రామంలో రూ.91,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం మాజీ జడ్పీటీసీ రుద్రబట్ల సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన, ప్రజా పాలన అందిస్తోందని అన్నారు. సంక్షేమపథకాలు సక్రమంగా అందేలా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక చొరవతో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి మాజీ సర్పంచ్ గాలి మధు, ఒడిలా రాజన్న, తోకల రామచంద్రం, ముల్కల సత్యనారాయణ, ఇగురం జగన్, ఈర్ల మల్లయ్య, తులసి రామ్, జలపతి రావు, దొంతుల శ్రీశైలం, కామెర గణేష్, కామెర మల్లేష్ పాల్గొన్నారు.

# ఏరియా ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి కృషి

- సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాత

నవతెలంగాణ-తాండూర్



సెప్టెంబర్ చివరి నాటికి బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి సమస్యలన్ని పరిష్కరిస్తానని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత హామీ ఇచ్చారు. శనివారం బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో స్థానిక శాసనసభ్యుడు గడ్డం వినోద్ సమక్షంలో బెల్లంపెల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ నేతలు చర్చలు జరిపారు. గత రెండు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యేకు ఆస్పత్రి పరిరక్షణ కమిటీ నాయకులు కలిసి సమస్యను విన్నవించడంతో ఆయన సింగరేణి చైర్మన్‌తో మాట్లాడి సమస్యను వివరించారు. దీంత కొత్తగూడెం నుంచి సింగరేణి సీఎంఓఏ సుజాత బెల్లంపల్లి ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి సందర్శన విషయం ముందే తెలియడంతో పెద్ద ఎత్తున సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ ట్రేడ్ యూనియన్ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. అనంతరం సింగరేణి ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ప్రధానంగా ఆస్పత్రి ఓపిలు తక్కువ చూపిస్తూ ఆస్పత్రిని ఇక్కడి నుంచి ఎత్తివేసే కుట్రలకు సింగరేణి యాజమాన్యం వ్యూహాత్మకంగా ముందుకెళ్తోందని పరిరక్షణ కమిటీ నాయకులు సీఎంఓఏకు తెల్పిచెప్పారు. ముఖ్యంగా ఆస్పత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్లను, ఇతర సిబ్బందిని త్వరితగతిన నియమించాలని విన్నవించారు. సమస్యను క్షుణంగా పరిశీలించిన సీఎంఓఏ సాధ్యమైనంత త్వరలో డాక్టర్లను సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పరిరక్షణ కమిటీ నాయకులు సీఎంఓఏను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ నాయకులు ఏఐటీయూసీ నుంచి చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, రత్నం ఐలయ్య, ఐఎన్టీయూసీ సిద్ధంశెట్టి రాజమౌళి, గెల్లి జయరాం యాదవ్, కాంగ్రెస్ మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు,హెచ్ఎంఎస్ ఎండీ ఓజియార్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



నవతెలంగాణ-మందమర్రి

నేరాలను నియంత్రించేందుకు, ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. శనివారం మందమర్రి ఎస్సీ, ఎస్టీ కాలనీలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనిఖీల్లో ధ్రువీకరణ పత్రాలు లేని 54 ద్విచక్ర వాహనాలు, 06 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం, కొత్త వ్యక్తులు, నేరస్తులు ఎవరైనా షెల్టర్ తీసుకుంటున్నారా, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారా అని స్థానికులని అడిగి తెలుసుకున్నారు. వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ధ్రువీకరణ పత్రాలను తప్పకుండా కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి కొత్త చట్టాలలో జరిమానాలు, శిక్షలను పెంచడం జరిగిందన్న విషయం ప్రజలు గ్రహించాలన్నారు.

**మహిళలు పిల్లల భద్రతే పోలీసుల లక్ష్యం**

మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని, మహిళలు పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా మానసికంగా, శారీరకంగా హింసించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మహిళల రక్షణ కొరకు షీ టీమ్స్ నిరంతరం పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ధ్రువ పత్రాలను పరిశీలించి వాహనాలను తిరిగి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సమూహంగా ఏర్పడి బహిరంగ మద్యపానం సేవించినా, ప్రజా శాంతికి భంగం కలిగించినా పోలీసులకు లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల రక్షణ కొరకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. పోలీసుల సహకారంతో వ్యాపార సముదాయాలు, కాలనీల్లో స్వీయ రక్షణకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని భద్రత విషయంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయలన్నారు. పోక్సో కేసుల నమోదు, శిక్షలు, బాల్య వివాహాలు, బాల్య కార్మిక వ్యవస్థ పర్యవసానాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, ఆర్ఎస్ఐ వెంకట్, సర్కిల్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాణహిత ముంపుకు విముక్తి ఎప్పుడు..?

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- ముంపు రైతులను ఆదుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వాలు మారినా ప్రాణహిత ముంపుకు విముక్తి లభించడం లేదని, పంట పొలాల మీదుగా పరవళ్లు తొక్కుతున్న ప్రాణహిత నది వరదకు అడ్డుకట్ట వేయడం లేదని సీపీఐ(ఎం) నాయకులు విమర్శించారు. శనివారం చెన్నూర్ పట్టణంలో సమావేశమైన నాయకులు ప్రాణహిత నది వరద కారణంగా రైతులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. కళేశ్వరం బ్యారేజీ నిర్మించినప్పటి నుంచి ప్రాణహిత, గోదావరి వరద ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రాణహిత నది వరద కారణంగా చెన్నూర్ నియోజకవర్గం పరిధిలోని కోటపల్లి, వేమనపల్లి, చెన్నూర్ మండలాలకు చెందిన రైతులు సాగు చేసిన పంటలను నష్టపోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తియ్యటి మాటలతో సంవత్సరాలు సాగదీస్తున్న ప్రభుత్వ పెద్దలు గత ప్రభుత్వం మాదిరిగా అదే ఒరవడి సాగిస్తోందని ఆరోపించారు. పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా పరిహారం పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడమే తప్పా పరిహారం పంపిణీ చేసిన పాపాన పోవడం లేదని ఆరోపించారు. నియోజకవర్గం పరిధి రైతులు గత నాలుగేండ్లు వంటలను నష్టపోతున్న తీరుపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సమస్యకు పరిష్కారం చూపించకపోగా పరిహారం పంపిణీపై పన్నెత్తు మాట మాట్లాడకపోవడం బాధిత రైతులకు ఆవేదన కలిగిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని ఆశించి ఓట్లు వేసి గెలిపించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందించి ప్రాణహిత, గోదావరి వరద ఇబ్బందులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి ముంపు భూములకు విముక్తి కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) చెన్నూర్ ఏరియా నాయకుల రాతిపల్లి నగేష్, సీడం సమ్మక్క, సామల ఉమారాణి, కుందారపు చంద్రన్న, బోగె నాగజ్యోతి, బోగె సత్యం పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ. 27 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం సంస్థ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించాలన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ రెండు గుంటల భూమి, రూ.20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించాలన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యాల వల్ల సింగరేణి సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, కాబట్టి నూతన బొగ్గు బావులను ఏర్పాటు చేయాలన్నారు. ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం అని చెప్పే సింగరేణి యాజమాన్యం పెర్క్స్ పై ఆదాయ పన్నును అధికారులకు యాజమాన్యమే చెల్లిస్తుందని కాని కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫీట్ కార్యదర్శులు గునిగంటి నర్సింగ్ రావు, సల్ల తిరుపతి, సాయి రాజు, అశోకరెడ్డి పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

నవతెలంగాణ-జన్నారం

మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండుకూరి రాజు అన్నారు. శనివారం మండలంలోని చింతగూడ గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ సంబరాలు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడం చారిత్రక విజయం అన్నారు. ఈ విజయం మాదిగ అమరవీరులకు అంకితం అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇందులో పూర్తి సహకారం అందించిన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు తీర్పు ఇచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ వెంటనే వర్గీకరణను తెలంగాణలో అమలు చేస్తానని ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి తెలంగాణ మాదిగ హక్కుల దండోరా తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం, కొండుకూరి ప్రశాంత్, మామిడిపల్లి అశోక్, కుందూరి లక్ష్మీరాజం, జింగిలి సురేష్, కె ప్రదీప్, ఆవునూరి సత్తయ్య, వేల్పుల రాజేషు పాల్గొన్నారు.

## పిల్లలకు ముర్రుపాలు తాగించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ

నవతెలంగాణ-జన్నారం

పుట్టిన పిల్లలకు తప్పకుండా ముర్రు పాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మా అన్నారు. శనివారం తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తల్లులకు, గర్భిణీలకు పలు సూచనలు, సలహాలు అందించారు. పుట్టిన పిల్లకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ జాడీ సంజీవరాణి, ఆయా మమత పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

ప్రొఫెషనల్ ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నస్పూర్ మండల నూతన కార్యవర్గాన్ని సీసీసీలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అగ్గు సాగర్, ప్రధాన కార్యదర్శిగా బాణాల రమణచారి, కోశాధికారిగా తాటిపాముల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనుకయ్య, కార్యదర్శి అప్పసు రాము, జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్, గౌరవ అధ్యక్షుడు ఎం కే.రాము, ప్రధాన కార్యదర్శి దేవి రవీందర్, కోశాధికారి సీపతి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్వాస తిరుపతి, మంచిర్యాల మండల అధ్యక్షులు రాజబాబు, మందమర్రి అధ్యక్షులు వెంకటస్వామి, బెల్లంపల్లి అధ్యక్షులు ఆకుల వేణు, జైపూర్ కిషోర్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

## వర్షాకాలంలో జాగ్రత్తలపై ఉద్యోగులకు అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

వర్షాకాలములో తీసుకోవలసిన జాగ్రత్తలపై సింగరేణి హెల్త్ ఆఫీసర్ డా.లోకనాథ్‌రెడ్డి శనివారం కెకె ఓసీలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన నీరు, ఆహారం తీసుకోవాలని, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు, నివారణ చర్యలు గుండెపోటు, బీపీ, షుగర్‌తో బాధపడే ఉద్యోగులు తప్పనిసరిగా మందులు వాడాలని, ప్రతీ నెల చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెకెఓసీ మేనేజర్ వీరయ్య, ఏఐటీయూసీ పిట్ సెక్రటరి కుమారస్వామి పాల్గొన్నారు.

## గుండాల రోడ్డు మరమ్మతులకు కృషి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని ఓట్ల గిరిజన గ్రామం నుండి ఆశీర్వ జిల్లా త్రివేణి మండలం గుండాల గ్రామానికి వెళ్లి ఘాట్ రోడ్డును శనివారం తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కోపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు ఊట్ల గుండాల రోడ్డును పరిశీలించినట్లు తెలిపారు. నిత్యం గుండాల ప్రజలు దండేపల్లి మండలం మీద ఆధారపడి జీవిస్తున్నారని గతంలో రోడ్డు నిర్మించినప్పటికీ పూర్తిగా శిథల స్థాయికి మారిందని రోడ్డు మరమ్మతుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ మునిమడుగుల శంకర్, జిల్లా డీఈ శహబాజ్ అహ్మద్, ఐటీడీఏ ఏఈ భీంరావ్, స్థానిక గిరిజన సంఘం నాయకులు కుడిమెత సోము, కొమరం లింగారావు, కనక జంగు, మాజీ ఎంపీటీసీ తోట మోహన్, నాయకులు కంది సతీష్, వనపర్తి రవి, దేవయ్య గుండాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలి

నవతెలంగాణ-జైపూర్

గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్ సూచించారు. శనివారం భీమావరం గ్రామ పంచాయతీ పరిధి పలు వార్డుల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. డ్రైనేజీల విడుదల ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఉరికి నీరు ఉరవకొండ జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. వార్డుల పరిధిలో నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటూ పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మురికి నీరు నిలవడం వల్ల దోమల వ్యాప్తి చెంది వ్యాధులు రబలే అవకాశం ఉంటుందని ఎవరికి వారుగా నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఎంపీఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## 6న ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడి రాక

నవతెలంగాణ-నస్పూర్

షెడ్యూల్డ్ కులముల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ ఈ నెల 6న జిల్లాకు వస్తున్నారని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమీషన్ కార్యదర్శి కల్లూ రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మంచిర్యాలకు చేరుకుంటారని, 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ఎన్‌సీఎస్‌సీ-హైదరాబాద్ సంచాలకులు సునీల్ బాబు తో కలిసి కలెక్టర్, పోలీస్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్, అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణపు పనులను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. శనివారం భీమారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన రూ.59 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ పనులను ప్రారంభించారు. స్థానిక మహిళలు మంగళహారులతో స్వాగతించారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు వార్డు స్పెషల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే స్వచ్ఛధనం, పచ్చదనం ప్రత్యేక కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఖానాపూర్ పట్టణంలో ఉన్న అన్ని వార్డులలోనీ వార్డు కౌన్సిలర్లతో కలిసి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు డెస్క్ బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం సమనుజ్ఞ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డెస్క్ బ్యాగులను పంపిణీ చేశారు. కింద కూర్చుని చదువుకోవడానికి ఇబ్బందులు పడే విద్యార్థులకు డెస్క్ సౌకర్యం కలిగిన బ్యాగులు ఇవ్వడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఉష్కం తిరుపతి పాఠశాల సిబ్బంది విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి, పంచాయతీ కార్యదర్శి అభయ్ పటేల్, సభ్యులు పి.సాయిరాజ్, విగ్నేష్, కార్తీక్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కలిసిన ఎంపీ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే రాంమోహన్ నాయుడుని శనివారం ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ కలిసి జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. మంత్రి విమానయాన శాఖ అధికారులను ఆదిలాబాద్ సందర్శించేందుకు పంపినట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం జిల్లా ప్రజల కలని, ఎయిర్‌పోర్ట్ అవసరమని వివరించారు. కేంద్ర మంత్రి ఆదిలాబాద్‌లో విమానాశ్రయం అవసరమని గుర్తించారని ఎంపీ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా యంత్రాగం, రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూర్చి ఇస్తే విమానాశ్రయం తప్పక ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికే 1592 ఎకరాల భూమిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారని మంత్రికి వివరించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా సుముఖంగా ఉందని మంత్రికి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని కొత్త రోడ్‌లో పోలీస్ కళాబృందంతో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని పేర్కొన్నారు. నేరాల అదుపునకు ప్రధాన చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అక్బర్ పాషా, ఏఎస్ఐ అజీజ్, హెడ్ కానిస్టేబుల్స్ సత్తయ్య, సంపత్, కానిస్టేబుల్ శ్రీనివాస్, సత్యనారాయణ, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్ఓగా డా.రాజేందర్

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా డా. రాజేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా పనిచేసిన డా.ధనరాజ్ సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. నిర్మల్ జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న డా.రాజేందర్‌ను ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ నియమించారు.

## రేపటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆగస్ట్ 5 నుండి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఐదు రోజులపాటు నిర్వహించనున్న సందర్భంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో సంబంధిత అధికారులకు ప్రత్యేక అధికారులుగా విధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. దీంతో రేపటి సోమవారం ప్రజావాణి ఉండదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రాకూడదని కోరారు.

## ఇన్‌చార్జి ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఆ గ్రామ యువకులు ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డిని సన్మానించారు. బాధ్యతలు చేపట్టి మొదటిసారి గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆయనను స్వాగతం పలికి సన్మానించారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం, మాజీ వార్డ్ సభ్యులు జీవన్, భోజరాజు, గ్రామస్తులు రామాయి శంకర్, జీపి సిబ్బంది ఎండి అజార్, రామగిరి శ్రీనివాస్, ఆశా, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## ముగిసిన తాళ సప్తమి వేడుకలు

నవతెలంగాణ-కుభీర్

గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న శ్రీరాజరాజేశ్వర ఆలయంలో కొనసాగుతున్న తాళ సప్తమి వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో రాజరాజేశ్వరునికి ముందుగా ఆలయ పూజారి జంగం దత్త్రాత్రి ప్రత్యేక పూజలు చేసి, ఆలయంలో శ్రీకృష్ణుడుకి ఉయ్యాల వేసి, నామకరణం చేశారు. అనంతరం అక్కడి నుంచి ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రాజరాజేశ్వర ఆలయంలో పురాతన కాలం నుంచి ఆనవాహితిగా వస్తున్న ఆచారాన్ని ఇప్పటి వరకు కోనసాగిస్తున్నామని అన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమం గత వారం రోజుల నుంచి ప్రతి రోజు వారిగా ఆర్య వైశ్యులు అక్కడ పూజలు చేసి నిత్యాన్నదాన కార్యక్రమాలు భజనలు చేపడుతున్నారు. చివరి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయంలోని రాజరాజేశ్వరున్ని దర్శించుకోవడానికి గ్రామానికి చుట్టూ ప్రక్కల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, శేరి సురేష్, బాబు, మడి రమేష్, రాజన్న గ్రామ పెద్దలు చిమ్మన్ పోశెట్టి, తూము రాజేశ్వర్, రాజన్న శివలింగం, స్వామి, నాగుల మల్లన్న, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

# ముర్రుపాలే పుట్టినబిడ్డకు ఆరోగ్యకరం

- రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్
- వైద్యులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రిమ్స్ మెడికోలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలే ఆరోగ్యకరమని, తల్లిపాలతోనే ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలు ఉన్నాయని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలలో భాగంగా రిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిమ్స్ నుండి కుమురంభీం చౌక్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి విస్తృత అవగాహన కల్పించామన్నారు. అప్పుడే జన్మించిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం మూలంగా గర్భదారణ సమయంలో పొందిన బరువును తగ్గించుకోవడానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, రొమ్ము క్యాన్సర్ వంటి వాటి నుండి బయటపడవచ్చన్నారు. అలాగే పిల్లల ఎదుగుదలకు, పోషణకు అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఈ తల్లిపాల వల్ల సమపాళ్లలో లభిస్తాయన్నారు. తమకు వచ్చిన మార్గదర్శకాల ప్రకారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

**ఖానాపూర్** : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐదవ వార్డ్ కౌన్సిలర్ పరిమిలత సురేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పాలిచ్చే తల్లులు సరైన పోషకాహారాలు తీసుకుంటు పిల్లలకు తల్లి పాలే ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పోషకాహారం బలామృతం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, ఏఎన్ఎం పార్వతి, ఆశ వర్కర్ త్రివేణి, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.



ఖానాపూర్ : చిన్నారికి బాలామృతం తినిపిస్తున్న కౌన్సిలర్

# మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-భైంసా

మున్నూరు కాపు సంక్షేమానికి తన వంతుగా పాటుపడతానని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శనివారం భైంసా పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సంఘ భవనం కోసం స్థలం ఇవ్వాలని, భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను విన్నవించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కులస్తులు ఐక్యంగా ఉండి సంఘ బలోపేతానికి పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు. గత పాలకులు బీసీ సంక్షేమాన్ని విస్మరించారని, తన హయంలో బీసీ కులాల సంక్షేమానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సమితి అధ్యక్షులు ఎనపోతుల మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఆకుల గోపాల్, గౌరవాధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, సలహాదారులు డాక్టర్ అల్లం పోశెట్టి, అడ్వకేట్ మురళిధర్, పురస్తు గోపాల కిషన్ పాల్గొన్నారు.

# రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య

నవతెలంగాణ-తలమడుగు

రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ భవనంలో తనిఖీ నిర్వహించారు. ఇప్పటి వరకు సొసైటీ ద్వారా ఎరువుల అమ్మకాలు ఎరువుల నిల్వ అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎల్లప్పుడూ ఎరువులు అందుబాటులో ఉంచాలని సొసైటీ సీఈఓ శ్రీనివాస్‌ను ఆదేశించారు. రైతులు అడిగిన ఎరువులను అందించాలని సూచించారు. అనంతరం ఇప్పటివరకు ఎరువుల అమ్మకాలు నిర్వహించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. సొసైటీ రికార్డులు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్, సొసైటీ సిబ్బంది బీంరావు, సత్యనారాయణ ఉన్నారు.



# మహిళా కార్మికులను కొనసాగించాలి



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఏరియా స్టోర్‌లో పనిచేస్తున్న మహిళా కాంటాక్ట్ కార్మికులను కొనసాగించాలని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు జెట్టి మల్లయ్య పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంట్రాక్టర్ మారడం వల్ల కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ మహిళా కార్మికులను విధుల్లోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో కార్మికులు మానసికంగా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నూతన కాంట్రాక్టర్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సింగరేణి అధికారులు, యాజమాన్యం స్పందించి వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ ఏరియా నాయకులు ఎండి అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల చేపట్టిన గిరిజన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలోని జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వచ్చిన పీజీ ప్రధానోపాధ్యాయురాలు చౌహాన్ వందనను శనివారం గ్రామ ఆంజనేయ స్వామి యూత్ సభ్యులు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో యూత్ సభ్యులు మర్సకొల లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ మెస్రం చందు, మెస్రం రాము, మెస్రం శేఖర్, పుసం శ్రీకాంత్, కుంర భీంరావ్, పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయ సిబ్బంది హరిచంద్, మల్కు, రజనీకాంత్, రవీందర్ ఉన్నారు.

## మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా విఠల్

నవతెలంగాణ-బోథ్

మండల మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా విఠల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పనిచేసిన సెక్రటరీ మనోహర్ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో విఠల్ బాధ్యతలు చేపట్టారు. ఆయనను మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి సన్మానించారు.

## జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మారుతీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా మారుతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు లెక్చరర్లు లెనిన్, సరిత, రాణి, శివరాజ్ బదిలీపై ఇంద్రవెల్లి కళాశాలలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ప్రిన్సిపాల్‌కు శాలువతో ఘనంగా సన్మానించారు.

## పేదింట్లో మెరిసిన ఆణిముత్యం

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన క్యాతం రమేష్ వెంకటమ్మ దంపతుల పెద్ద కూతురు అపర్ణ మొదటి ప్రయత్నంలోనే ఏఈఈ పోస్టుకు ఎంపికైంది. ఇటీవల విడుదలైన టీఎస్పీఎస్సీ ఉద్యోగ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈ ఉద్యోగానికి ఎంపికైంది. సాధారణ నిరుపేద రైతు కుటుంబం నుంచి మొదటి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు ఆమెను అభినందించారు.

## వేదం పాఠశాలలో స్నేహితుల దినోత్సవం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని ముందస్తుగా జరుపుకున్నామని ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ తెలిపారు. విద్యార్థులు స్నేహానికి గుర్తుగా ఒకరికొకరు బ్యాండ్‌లు కట్టుకుని వారి స్నేహాన్ని తెలుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లలకు స్నేహం గొప్పతనాన్ని, విలువలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఈఓకు ఘన సన్మానం

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ మేజర్ గ్రామపంచాయతీ ఈఓగా ప్రసాద్‌గౌడ్ ఇటివలే ఉద్యోగ భాద్యతలు చేపట్టారు. శనివారం ముధోల్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామాభివృద్ధికి మా సంఘం అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షులు నారాయణ, కోశాధికారి మైత్రి సాయినాథ్, గంగాధర్ పాల్గొన్నారు.

## నాలుగు ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి సీహెచ్ ఈశ్వర్ టీజీపీఎస్సీ నిర్వహించిన జెఎల్ బాటనీలో రాష్ట్ర స్థాయి 18వ ర్యాంకు సాధించారు. గతంలో సీఎస్ఐఆర్, ఎన్ఈటీ, జేఆర్ఎఫ్, టీఎస్ టెట్‌లలో అర్హత సాధించి 2023లో నవోదయ విద్యాలయ పీజీటీగా తెలంగాణ గురుకుల జెఎల్, డిఎల్‌గా ఎంపికయ్యారు. ఈయన జైనూర్ మండలం పాట్నాపూర్‌లో ఒక పేద కుటుంబంలో జన్మించారు. స్వశక్తితో నాలుగు ఉద్యోగాలు సాధించిన ఈశ్వర్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్గారామ్ అంతర్వేది శనివారం కళాశాలలో పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తమ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వృక్ష శాస్త్రం అధ్యాపకులు అష్రఫ్ అలీ, ఇతర అధ్యాపకులు ఆయనను అభినందించారు.

## బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ సబ్ రిజిస్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఇమ్రాన్ ఖాన్‌ను శనివారం దస్తావేజు లేఖర్లు ఘనంగా శాలువాతో సన్మానించారు. జగిత్యాల జిల్లా మల్యాల సబ్ రిజిస్టర్‌గా బదిలీపై వెళ్లారు. అనంతరం బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ కపిల్‌ను సైతం దస్తావేజ్ లేఖరులు సత్కరించారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు చింతపండు రవి కుమార్, పల్లికొండ జనార్థన్, పరిమి శ్రీనివాస్, ఆమంద రాజశేఖర్, ముథం వైశాలి, పూదరి పరమేష్ పాల్గొన్నారు.

## జిల్లా జైలులో అదాలత్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని జిల్లా జైల్‌లో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు ఖైదీలకు సంబంధించి నాలుగు కేసులను పరిష్కరించారు. ఖైదీలకు సత్వర న్యాయసాయం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న జైల్ అదాలత్ ఖైదీలకు ఎంతగానో దోహదపడుతుందని న్యాయమూర్తి దుర్గారాణి అన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ గంగారాం, అశోక్, ఉమేష్, జైల్ పర్యవేక్షణాధికారి అశోక్, ఉమేష్ రావ్ ఉన్నారు.

## అంత్యక్రియలో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-బేల

రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన విద్యార్థి ప్రీతం మృతిచెందగా సోమవారం అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలోని సాంగిడి నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అంత్యక్రియలో పాల్గొని మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## ముడవ విడత ద్వారా ఐటీఐలో అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ప్రయివేటు ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం మూడవ విడత షెడ్యూల్ విడుదలైందని ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పీ. శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 2 నుండి దరఖాస్తులు ప్రారంభమయ్యాయని 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. తమ కళాశాలలో వివిధ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. మొదటి రెండవ విడతల్లో దరఖాస్తు చేసి సీట్ రానివారు ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకోవాలని సూచించారు. ఇటీవల సప్లమెంటరీలో పదవ తరగతి పాస్ అయినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మొక్కలు నాటిన ఏఓ

నవతెలంగాణ-బేల

వనమహోత్సవంలో భాగంగా శనివారం ఆవాల్ పూర్ గ్రామ రైతు వేదిక ఆవరణలో మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించేల చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మినక పుష్పలత సుధాంరెడ్డి, మాజీ ఎంపిటీసీ నగేష్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతులు సంతోష్, భూమన్న పాల్గొన్నారు.